# సడలిన సంస్కృతి

## మరువాడ రాజేశ్వరరావు

అప్సరా హోటల్ పోర్టికోలో ఒక టేక్సీ ఆగింది. ఆ టేక్సీలోంచి స్కర్ట్‌లు వేసుకున్న ఇద్దరు ఆంగ్లోఇండియన్ అమ్మాయిల భుజాలమీద చేతులువేసి ఒక వ్యక్తి దిగేడు. అతని వెనక పైటలు జార్చుకుని మళ్ళా సవరించుకుంటూ మరో యిద్దరు యువతులు దిగేరు.

అమ్మాయిల బుగ్గలు నున్నగా నిగనిగలాడుతున్నాయి. పెదాలు లిప్‌స్టిక్ ఎరుపు నిండివున్నాయి. పొడుగ్గా, బలంగా వున్నారు. చురుగ్గా, నీటుగా కూడా వున్నారు.

'అతను' నల్లగా పొడుగ్గా వున్నాడు. కళ్ళకి గాగుల్స్; గోధుమరంగు సూటు తొడుక్కున్నాడు. ఎంబాసడర్ షూస్ కాళ్ళని అంటిపెట్టుకుని వున్నాయి. పెదాల మధ్య త్రీకేసెల్స్ సిగరెట్టు, భుజాన ఒక కొత్త లెదర్ బేగ్...

రోడ్డుమీదపోయే జనం వాళ్ళని చూసి ఆగిపోయేరు. కళ్ళు తెరుచుకుని ఆశ్చర్యంగా చూస్తున్నారు. వాళ్ళ చూపులు ఆంగ్లోఇండియన్ యువతుల తెల్లగా మెరుస్తోన్న మోకాళ్ళమీద-పిక్కలమీద వాలి, కొంచెం పైకిపోయి-నున్నని మెడకింద గుచ్చుకుని, అటునుంచి 'అతని'మీద ఒకసారి తిరిగి అతని కవిని, సొగసుని మెచ్చుకుని, వెనకనున్న అమ్మాయిల సిల్కు చీరల సందుల్లోకి, మడతల్లోకి, నగ్నంగా మెరుస్తోన్న వాళ్ళ దేహ భాగాలపైకి ప్రసరించి-అలా విహరిస్తున్నంతలో—

వాళ్ళు హోటల్లోపలికి కనుమరుగైపోయేరు. "ఎవరతను? ఎవరు??" అని ప్రశ్నించుకున్నారు జనం కళ్ళతోటే! "ఏమో! ఏమో?" అని సమాధానం కూడా చెప్పుకున్నారు కళ్ళతోనే!

అంతసేపూ జనం ఈగల్లా ముసిరిన సంగతి గమనించని వాచ్‌మన్ ఉగ్రుడైపోయేడు. లాఠీకర్ర ఝళిపిస్తూ వాళ్ళని "పోండి, పోండి!" అన్నాడు.

అతికష్టమ్మీద చూపులు తిప్పుకుని, నోళ్ళు మూసుకుని, మతులు తెచ్చుకుని నడిచేరు జనం.

'అతను' హోటల్లో డబుల్‌రూం ఒకటి తీసుకుని కులాసాగా ఆడుకుంటూ గదివేపు నడిచేడు. అతనివెంట కిలకిలా నవ్వుతూ, అతనిమీద వాలిపోతూ, తూలిపోతూ నలుగురమ్మాయిలూ...

వాళ్ళని చూసి హోటల్లో వుంటున్న వాళ్ళు, వస్తేస్తున్నవాళ్ళు అంతా 'ఎవరంటే 'ఎవర'ని అనుకుంటున్నారు. 'ఎన్. జి. పాల్.' అన్న సమాధానం కౌంటర్ దగ్గర్నుంచి వొచ్చింది.

"ఓహో! ఎన్. జి. పాల్‌ట!" అనుకుని ఆశ్చర్యపడ్డారంతా. వెంటనే 'ఎన్. జి. పాల్ అంటే ... ఎవరు? ఎవరు!...' అనుకున్నారు మళ్ళా.

"అతని పేరుమాత్రం ఎన్. జి. పాల్! అతనెవరో మనకి తెలీదు..." అన్నారు కౌంటర్ దగ్గరవాళ్ళు.

"అవును. ఎవరో తెలీడంలేదు. ఎవరు చెప్మా?!" అనుకున్నారంతా.

పన్నెండో నెంబరు గది వాళ్ళందరికీ 'ఫోకల్ పాయింట్'గా మారింది. మరో పదినిముషాల్లో పన్నెండో నెంబరు గది నించి టిఫెన్‌కి ఆర్డరొచ్చింది. నలుగురు కుర్రాళ్ళు నిండుగా ప్లేట్లు, గిన్నెలు, గ్లాసులు పట్టుకెళ్తున్నారు. గదిలో టేబిలు ముందు అతను కూర్చున్నాడు. అతనికి దగ్గరగా అటూ ఇటూ అమ్మాయిలు సర్దుకున్నారు.

బల్లమీద ప్లేట్లు ఖాళీ ఔతున్నాయి. కొత్తప్లేట్లు మళ్ళీమళ్ళీ వొస్తున్నాయి. డ్రింకుల్తో గ్లాసులు నిండుతున్నాయి. పూర్తిగా ఖాళీ అవకుండానే నింపుతున్నారు సర్వరు కుర్రాళ్ళు. మధ్యలో వాళ్ళు మూతులు ఎంగిలి చేసుకుంటున్నారు. అది చూసి సర్వరుకుర్రాళ్ళు చాటుగా నవ్వుకుంటున్నారు. 'ఈడో నల్లదొరనాగున్నాడ్రా!' అన్న సందేహాన్ని రహస్యంగా మిగతా సర్వర్ కుర్రాళ్ళకి వ్యక్తం చేసేడొకడు.

* * *

ఇంతలో పెద్ద అంగలు వేసుకుంటూ ఉత్సాహంగా వొస్తూన్న అతని వెం అమ్మాయిలు నలుగురూ వొచ్చి టేక్సీలో కూర్చున్నారు. డ్రైవరు ఒక్క పరుగులో వెళ్ళి సీట్లో కూర్చున్నాడు.

గేటులోంచి బైటి పోతున్న కారులో తొంగిచూసేడు వాచ్‌మన్. అలా చూడ్డం ఎవరేనా చూసేరేమోనని గాబరాగా ఇటూఅటూ చూసేడు. అందరూ చూస్తు న్నారు. కాని వాచ్ మన్ [illegible]. అందరి చూపులూ కారువెనక కొంతసేపు ప్రయాణించి తిరిగొచ్చేయి. అందరికంటే దగ్గరగా చూడగలిగినందుకు వాచ్ మన్ చాలా గర్వించేడు.

'హో కౌన్ హై?' అడిగేడు లాన్ మీద కూర్చొని పేపరు చూస్తూన్న హిందూస్తానీ పెద్దమనిషొకడు.

ఆ ప్రశ్న అక్కడ చేరినవాళ్ళందర్లోనూ ప్రతిబింబించింది. సమాధానం మాత్రం దొరకలేదు.

* * *

లీలామహల్ పోర్టికోలోకి ఒక టేక్సీ ప్రవేశించింది. ఆ టేక్సీలోనుంచి ఎన్. జి. పాల్ దిగేడు. అతనివెంట అప్సరసల్లాంటి అమ్మాయిలు నలుగురు దిగేరు.

దిగుతూనే అతను అమ్మాయిలవేపు తిరిగి ఏదో అన్నాడు. అందుకు వాళ్ళు విరగబడి నవ్వేరు. ఒకామె నవ్వాపుకోలేక అతని భుజంమీద వాలి, అతని చేతిని గట్టిగా కౌగలించుకుని, జారిన పైటని గమనించకుండా ఇంకాఇంకా నవ్వుతోంది.

చిర్నవ్వు చిందిస్తూ కౌంటరువేపు నడిచే డతను.

వరండాలోనూ,పోర్టికోలోనూ, రోడ్డు మీదవున్న జనమంతా తమదృష్టిని అతని వేపు, అతని వెంటబడ్డ అమ్మాయిలవేపు కేంద్రీకరించారు.

'ఎవరు?' 'ఎవరు??' 'ఎవరు???' అన్న ప్రశ్నలు గాలిలో తేలిపోయేయి...సమాధానం దొరక్క త్రిశంకుస్వర్గంలో నిలిచి పోయే యా ప్రశ్నలు.



ఇటు ఇద్దరు, అటు ఇద్దరు అమ్మాయిల మధ్య కూర్చున్నాడతను. బాల్కనీలోని ప్రేక్షకు లందరిదృష్టినీ ఆకర్షించేరు వాళ్ళు. స్లీవ్ లెస్, లో నెక్ జాకెట్లలోంచి నున్నగా లేగులాబిరంగులోను, తెల్లగాను, చామన చాయగా మెరుస్తోన్న భుజాలని, వీపు భాగాన్ని మాటిమాటికీ చూస్తూనే వున్నారు వెనుకనున్న ప్రేక్షకులు.

ముందు వరసల్లో ఉన్న వాళ్ళుకూడా ఏదో మిష పెట్టి వెనక్కి చూస్తూనే వున్నారు.

ఒకరి వీపు లొకరు చరుచుకోడాలు, నిమురుకోడాలు, గిల్లుకోడాలు, అర్థం లేకుండా మాట్లాడేస్తూ కిలకిలా, గలగలా నవ్వుకోడాలు – ఎవర్నీ డిస్టర్బ్ చేసినట్టు లేదు. ఎదురుగా ఇంగ్లీషు సినిమా బొమ్మలు కదుల్తున్నా అందరికీ అసలు సినిమా బాల్కనీలో మూడో వరసలో కుడిపక్క నున్న అయిదు సీట్లలోనే జరుగుతున్నట్టు తోస్తోంది.

సినిమా మొదలుపెట్టి గంటసేపయింది. అతను ఏమీ తోచనట్టు అటూ ఇటూ చూసేడు. చీకట్లో ముద్దుగా, గోముగా

పలకరిస్తోన్న కళ్లనిచూస్తే అతనికి పెంపుడు కుక్క చూపులు తలపుకొచ్చేయి. విసుగ్గా లేచేడు. అమ్మాయిలు నలుగురూకూడా లేవబోయేరు. కూర్చోమన్నట్టు సౌంజ్ఞ చేసేడు.

"బోరుగా వుంది. సిగరెట్టు కాల్చుకొస్తాను, కూర్చోండి!" అన్చెప్పి హాలు బైటికి నడిచేడు.

అరగంట గడిచింది. ఇంటర్వెల్ కి సైమౌతోంది. అత నింకా రాలేదు. అమ్మాయిలు ఆందోళనపడ్డారు. చూసొద్దామంటూ హాలు బైటికి నడిచేరు.

కారూలేదు, మనిషీ లేడు!

విస్మయంతో ఒకరివే పొకరు చూసుకున్నారు అమ్మాయిలు.

"మళ్ళీ వొస్తాడంటావా?" బేలగా చూసిందొకామె.

"ఏమో!" అన్నట్టు పెదిమ విరిచిందొకామె.

"అసలాయనెవరు?" అనడిగింది మరొకర్తె.

"ఎవరో కోటీశ్వరుడే అయ్యుంటాడు!" అంది చీర సరిగా సింగారించని మగువ.

* * *

బీచొడ్డున క్వాలిటీ కేంటీన్ నీలిరంగులు సింగారించుకుంది. రాత్రి ఎనిమిదిన్నర కావడంవల్ల కాబోలు, ఎక్కువమంది మనుషులు లేరు. గాలి ప్రశాంతంగా వీస్తోంది. నల్లని సముద్రం అంచులదగ్గర చంద్రకాంతిలో వింతగా వెలుగుతోంది. కెరటాలు ఎగిరెగిరి పడుతూంటే తెల్లని వెండినురగలు విచ్చుకున్నాయి.

వాతావరణం అతి నిశ్శబ్దం.

సముద్ర ధ్వని గంభీరం!

కేంటీన్ ముందొక టేక్సీ ఆగింది. టేక్సీ లోంచి ఎన్. జి. పాల్ దిగేడు. అతని వెంట ఈసారి ముగ్గురు యువతులున్నారు. వాళ్ళలో ఇద్దరు వొంటి కతుక్కుపోయి వొంపుసొంపుల్ని ప్రదర్శించే పల్చనిదుస్తుల్లో వున్నారు. పొట్టిలాగు, వొదులుచొక్కా వేసుకుంది మరో యువతి.

వాతావరణంలో నవ్వులు చెలరేగేయి. సముద్రం అస్పష్టంగా గొణుగుతోంది. కేకలతో కేరింతలతో ప్రకృతి ప్రతిధ్వనిస్తోంది.

మెరుపు మెరిసి మాయమైనట్టు మరో పదినిముషాల్లో నలుగురూ వెళ్ళిపోయేరు.

కళ్ళు చెదరిన ముసలిప్రొఫెసరుగారు, "హూ ద హెల్ యీజ్ హి?" అన్నారు.

ఒకమూల కూర్చుని అయిస్ క్రీం తింటున్న జంటలోని గోరువంక "ఇతన్నెప్పుడో చూసినట్టుందండీ!" – అనబోయి, మళ్ళీ ఆ మాటలు ఎటువంటి అపార్థాలకి, అనర్థాలకి దారితీస్తాయోనని భయపడి ఊరుకుంది.

కొంచెం దూరంగా ఇసకలో కూర్చున్న యువకులు – వాళ్ళు వెళ్ళిపోయేవరకూ లయబద్ధంగా ఈలలు వేస్తూనేవున్నారు.

తనకి లోకజ్ఞానం బాగా ఉందనుకునే సీతప్పని "అత నెవరు గురూ?" అనడిగేడు సూర్నారాయణ. సీతప్పకూ్కడా తెలీదు.

* * *

ఎంజాయ్ వెల్' నైట్ క్లబ్బులో ప్రోగ్రామింకా ప్రారంభంకాలేదు. విశాలమైన హాల్లో భోజనాలుచేస్తూ కబుర్లు చెప్పుకుంటోన్న వాళ్ళందరి దృష్టీ ద్వారం వేపు మళ్ళింది. డాన్సు చేసుకుంటూ కూనిరాగాలు తీసుకుంటూ కులాసాగా వస్తోన్న వ్యక్తిని, అతని వెంట వున్న అమ్మాయిల్నీ చూసి క్షణకాలం ప్రేక్షకుల చూపులు స్తంభించిపోయేయి.

అరగంటలో పాశ్చాత్య వంటకాలతో భోజనాలు ముగించేరు. వెంటనే గ్లాసులొచ్చేయి. గ్లాసులు నింపడానికి 'జానీ వాకర్' 'వేట్ 69' సీసాలు ఖాళీకాతోంటే కొత్త సీసా లొస్తున్నాయ్!

ఇంతలో లైట్లు 'డిమ్'గా అయిపోయేయి. సంగీతం సన్నగా వినవస్తోంది. స్టేజిమీద కాంతి ఫోకస్ లో ఒక అందమైన అమ్మాయి తెల్లని ఉడుపులతో నిలబడింది.

చీకట్లోంచి కొరడా ఛెళ్లుమంది. బాధామయమైన కోమల కంఠస్వరం వినవచ్చింది. ప్రేక్షకులకి వొళ్ళు ఝల్లుమంది. ఫోకస్ లోని ఆడదాని ఒంటిమీంచి ఒక ఉడుపు జారిపోయింది...ఆమె ఆడుతోంది. ఆమె ఆటని 'ఫోకస్' అనుసరిస్తోంది. కొరడా మళ్ళీమళ్ళీ ఛెళ్ళుమంటోంది. ఉడుపులొక్కొక్కటే జారిపోతున్నాయి. ఆర్తస్వరం గుండెల్లో ఘూర్ణిస్తోనేవుంది–నీరవం చేసే శబ్దాలలాగే ఉంటాయేమో! చివరికి ఆమె వొంటిమీద రెండు గుడ్డపీలికలు మాత్రం మిగిలేయి! అక్కడ చేరిన వాళ్లలో మిగిలిన సభ్యత అంతేనేమో! అక్కడ చేరినవాళ్ళ సంస్కారానికి ప్రతిబింబంగా నిలిచిన ఆమె 'ఫోకస్'లో ప్రతి అవయవాన్ని విప్పుకొంటూ ఆడుతోంది. ఒకో ప్రేక్షకుణ్నీ పలకరిస్తోంది. కేరింతలు కొడుతూ రూపాయలు విసురుతున్నారు ప్రేక్షకులు.

ఆమె అతని దగ్గరికెళ్ళి, నడుమూపి, రొమ్ములు కదిపి ఆశగా చూసింది. పకపకా నవ్వేడతను. వెర్రిగా నవ్వేడు. ఖాళీసీసా విసిరేస్తే పగిలినట్టు నవ్వేడు. రూపాయల కట్ట విసిరేడు. ఆ రూపాయలకట్టమీద అతని కన్నీటిబొట్టు ఒకటి ఇంకిపోయింది.

ఉన్న గుడ్డపీలికలు కూడా పీకేయమని ప్రేక్షకుల కోరిక. తమ 'సభ్యత' ని 'సంస్కారా' న్ని నగ్నంగా చూచుకోవాలనే సివి(ఫి)లైజ్డ్ కోరిక.

చివాల్న లేచేడతను. ఒక్క ఉదుటున రెండు గుడ్డపీలికలూ లాగేశాడు.

వెర్రిగా చూసిందామె.

సిగ్గు, శరం, అభిమానం లేకుండా చూసిందామె.

అందరూ చూస్తున్నారు తమ తమ మనస్సుల నగ్న సౌందర్యాన్ని.

పిచ్చిగా నవ్విందామె.

రూపాయనోట్ల వర్షం కురిపించేడతను. ఆ వర్షంలో స్వైరవిహారం చేసిందామె.

ఇంకా నవ్వుతూనే వున్నాడతను. నవ్వుతూ, తూలుతూ ద్వారంవేపు నడిచేడు.

అప్సరా హోటల్లో రూముతీసుకున్న సంగతి మర్చిపోయేడతను. 'ఎంజాయ్ వెల్' హోటల్లో ఇరవై మూడో నంబరు గదిలోకి ప్రవేశించేడు. సీసాలు, గ్లాసులు లోపల అమిరేయి. తలుపు మూసుకుంది.

తాళంకన్నంలోంచి చూసే వెయిటర్లకి ఏం కనిపిస్తుంది? కొనుక్కున్న ఆడవాళ్లని ఆటబొమ్మలు చేసి ఇష్టంవొచ్చినట్టు అత నాడుకునే ఆటలు తప్ప!

* * *

అలా మూసుకున్న తలుపులు–తిండికీ, 'మందు' సీసాలకిమాత్రం కొద్దిగా తెరుచుకుని మళ్ళా మూసుకుంటూ మూడ్రోజులు గడిచింది.

స్వర్గం అనుభవిస్తున్నా డనుకున్నా రంతా! ఇంకా ఏంకావాలి? మదిర, మదవతి ఉంటే ఆ స్వర్గంలోంచి బైటికెందు కొస్తాడు?

మూడోరోజు సాయంత్రం ఆరుగంటల వేళ గది తలుపులు తెరుచుకున్నాయి. అస్తవ్యస్తంగా బట్టలు కట్టుకున్న ఆడవాళ్ళు ముగ్గురూ భయావహులై పరుగులు పెడుతూ గది బైటికొచ్చేరు. వస్తూ వుండగా వాళ్ళ ఒంటిమీద బెల్టుదెబ్బలు తట్లుతీరేయి. వాళ్ళ వెనకనించి నోట్ల కట్టలు ఎగిరిపడ్డాయి. ఆత్రంగా వాటి నేరుకున్నారు ముగ్గురాడవాళ్లూ!

వాళ్ళు వెళ్ళిన కొంతసేపటికి బైటి కొచ్చేడతను. అతని బట్టలు నలిగివున్నాయి. కళ్ళు ఎర్రగా మండిపోతున్నాయి. నడక నీరసంగా వుంది. కదలిక నిస్సత్తువగావుంది. భుజాన బేగ్ వేళ్ళాడుతోంది. హోటల్ బిల్లు చెల్లించి, టేక్సీవాడికి డబ్బిచ్చి పంపేశాడు.

తూలుతూ నడుస్తూ మెల్లగా హోటల్ బైటికొచ్చేడు. హోటల్ వేపొకసారి చూసేడు.

అప్పుడే దీపాలన్నీ వెలిగించేరు. ఆ కాంతి, ఆ వైభవం...కళ్ళకి మిరుమిట్లు గొల్పుతున్నాయి...



ఆడా, మగా లోపలికి వస్తూ పోతూ న్నారు...

"మంటలు! మంటలు!!" అని ఆనందంగా అరిచేడతను.

లోపలికి వొచ్చే పోయే మనుష్యులు సిగ్గు, లజ్జ, మానాభిమానాలు, ఆత్మగౌరవం, మానవత్వం అన్నీ విప్పేసుకుని దిగంబరంగా, వెకిలిగా నవ్వుకుంటూ, తూలుకుంటూ పోతున్నట్టు కనిపించింది.

"ఈ పురుగుల్నందర్నీ ఈ మంటల్లోకి తోసేయండి హో! కాల్చిపారేయండీ!!" అని పిచ్చిగా గట్టిగా అరిచేడతను.

ఆ అరుపు లేవీ గొంతువిడి బైటికి రాలేదు. కాని నవ్వుతున్నాడతను. ఆ పురుగులు మంటల్లో కాలిపోతున్నట్టు ఊహించుకుని పకపకానవ్వుతున్నాడు. అతని నవ్వు చూసి ఎదురుగానున్న పదిహేనేళ్ళకుర్రాడు ఇంకా చిత్రవిచిత్రంగా పిల్లి మొగ్గలు వేయసాగేడు. తన విద్యని మెచ్చుకునే అతను నవ్వుతున్నాడనుకున్నాడు. జేబులో చేతికి దొరికినంత విసిరేడతను. పదిరూపాయల నోట్లు!

ఆ కుర్రవాడు భయపడిపోయేడు.

"బాబూ, పొరపాటున పదిరూపాయల నోటిచ్చీసేరు!" అన్నాడు సవినయంగా.

అయితే ఏమైందన్నట్టు చూసేడతను.

"పదో – పదిహేనో పైసలు చాలు బాబూ!" అన్నా డమాయకంగా.

పకపకా నవ్వేడతను.

"పదిరూపాయలైతే చేదా, ఏం?" అనడిగేడు.

సమాధానం రాలేదుగానీ కుర్రాడి కళ్ళల్లో భయం కనిపించింది. డబ్బంటే భయం!

డబ్బున్నవాడంటే భయం!!

ఆ కుర్రాడి వీపు తట్టాడతను.

"ఒరే, తమ్ముడూ! నువ్వెవరికీ భయపడకు. డబ్బు కసలు భయపడకు. ఔను. నువ్వెందుకు భయపడాలి? ఆ ఇంద్రభవనాలు చూస్తున్నావా? మంటల్లా వెల్గుతున్న ఆ దీపాలు చూస్తున్నావా? వాటిలో ఏం లేదురా...అవి పగిలిపోయిన విస్కీ సీసాల్లాటివి!

అక్కడ సభ్యత, సంస్కారం, మంచి,

మర్యాద, ఆత్మగౌరవం మచ్చుకైనా కన పడదు. అక్కడ ఎవరికి జీవం లేదురా తమ్ముడూ! డబ్బుంది. రాళ్ళూ, సిమెంటూ, సున్నంవున్నాయి. తోలుచర్మాలున్నాయి. మాంసంముద్ద లున్నాయి. మనసు, మమత, న్యాయం, ధర్మం లేవురా బాబూ లేవు!

అటువంటి బ్రతుకు నెప్పుడూ కోరరు. అనుభవంమీద చెప్తున్నా!!" కళ్ళు పెద్దవి చేసుకుని ఆశ్చర్యంగా వింటున్న కుర్రవాడి వేపొక చిర్నవ్వుని విసిరి ముందుకి నడిచేడతను.

* * *

శివాలయం చాలా సందడిగా వుంది. ఎవరో రుద్రయాగం చేస్తున్నారట! వచ్చే పోయే జనంతో కళకళలాడుతూవుంది. పడిబట్టలవాళ్ళు, మడిబట్టలవాళ్ళు, విభూతి రేఖలూ - రుద్రాక్షతావళాల వాళ్ళూ భక్తినలంకరించుకుని మరీ తిరుగుతున్నారు.

దేవుడెక్కడుంటే దీను లక్కడుండటం రివాజు!

దీనులు రోదిస్తూంటే - భక్తుల కేసి దయాసాగరాల్లాంటి చూపుల్నీ వెన్నెల్లాంటి చిర్నవ్వుల్నీ ప్రసరించడం దేవుడికి రివాజు.

ఆయన దయని దోసిళ్ళనిండా నింపుకున్న వాళ్ళు అలా వెళ్ళిపోతూ దీనులమీద కొంచెం చిలకరించడం కూడా సాధారణంగా జరుగుతూనే వుంటుంది.

వీధిలోంచే దేవుడికి నమస్కారంచేసేడు.

అవే ముఖాలు!

ఎక్కడ చూచినా అవే ముఖాలు...

ఆశ! అహంకారం!!

హోదా! అధికారం!!

గుడి బైట నున్న బిచ్చగాళ్ళవేపు చూసేడు.

భయం!...ఆకలి!!...

మనుగడ!...భయం!!...

అవును ... అవే ముఖాలు! ఎటు చూసినా...

మంటలు—మంటల్లో పురుగులు!

మంటలు—ఆకలిమంటలకి ఆహుతయే శలభాలు!!

ఎటు చూసినా మంటలు! మంటలు!!

మంటలు ఆర్పేయాలి!...

వెంటనే బేగ్‌లోంచి నోట్లకట్టలు పైకి తీసేడు. అడుక్కునే వాళ్ళమీద రూపాయి నోట్లు గాలిలోకి విరజిమ్మేడు.

మంటల్ని చల్లార్చడానికి నీళ్ళు...

గాలిలో నోట్లు...తిండి...ఆకలి!

ఆకలి...తిండి...గాలిలో నోట్లు!!...

ఎగిరెగిరి అందుకుంటున్నారు. కిందా మీదా పడి దొర్లుతున్నారు...గుడిలోవున్న భక్తులు వినోదం చూస్తున్నారు.

పోలీసాఫీసరు రాఘవరావు ముడివడ్డ కనుబొమల్లో ఏవో అనుమానం దోబూచులాడింది.

నోట్లు అందుకోడానికి బిచ్చగాళ్ళు పడుతున్న అవస్థ-ఆత్రుత చూసి 'పాల్' కళ్ళలో నీళ్ళు తిరిగేయి.

"అన్నలారా! ఎందుకలా డబ్బుకోసం తన్నుకుంటున్నారు? దరిద్రం అంత దుర్భరమైందా? ఆకలి అంత భయంకరమైందా?? కావొచ్చు! కావొచ్చునేంటి అక్షరాలా నిజం! నే ననుభవించలేదూ? నేనూ వారం రోజుల క్రితం దరిద్రుణ్నే నయ్యా! బీదరికాన్ని ఎంతగానో అసహ్యించుకునేవాణ్ణి. ఎప్పుడు కావాలంటే అప్పుడు, ఏది కావాలంటే అది కడుపునిండా తింటూ-ఖరీదైన బట్టలు కట్టుకుని కులాసాగా, జల్సాగా తిరిగేవాళ్ళని చూస్తే నాకో విధమైన భక్తి కలిగేది. వాళ్ళని దేవతల్లా భావించేవాణ్ని!

నమ్మండి బాబూ, నేను పేదరికంలో వున్నా శ్రీమంతుల ప్రాపకంకోసం నానా గడ్డీ కరవడానికి సిద్ధపడ్డాను. శ్రీమంతుల బిడ్డలతో స్నేహం సంపాయించేను. వాళ్లు మాట్లాడుకునే విషయాలేవిటో తెలుసా? సారా. రకరకాల మద్యాల రుచుల్లో తేడాలగురించి, ప్రత్యేకతల గురించి మాట్లాడుకునేవారు. రెండోది ఆడది. డబ్బిచ్చి సంసారుల్నీ, సానివాళ్ళనికూడా వల్లో వేసుకునేవారు. వాళ్ళు ఎంగిలిచేసి విసిరేసిన సుఖాలు భక్తితో అందుకునేవాణ్ని.

అయిపోయింది బాబూ! అంతటితో కాలేజీ చదువైపోయింది. గుమస్తాగిరీ వెలిగించక తప్పలేదు. ఆ ఎంగిలిసుఖాలు కూడా దొరకడం మానిసేయి. నే నసహ్యించుకునే పేదరికంలోనే స్థిరంగా పాతుకుపోయేను ..." అంటూ ఒకసారి ఆగేడు. చుట్టూ చూసేడు. అంతా నోళ్ళు తెరుచుకుని శ్రద్ధగా వింటున్నారు. పోలీసాఫీసరు రాఘవరావుగారు అంతా నోట్ చేసుకుంటున్నాడు

ఎన్. జి. పాల్ ఎందుకో గట్టిగానవ్వేడు. "ఏంటయ్యా, వింటున్నారూ! మీకేం పిచ్చేంటి? డబ్బంటే అలా పిచ్చెత్తిపోవద్దనేనయ్యా నేను చెప్తూంట!...ఆఁ! అంతే!-" అంటూ ముందుకి నడిచేడతను.

అతని వెనుక విచిత్రంగా చూస్తున్నారంతా!

ఎవరు?—

ఎవరు!—

దేవుడా!?—

దేవుడైతే నోట్లకట్టలు భక్తులకి పంచుతాడు కాని, ముష్టివాళ్ళకా? ఏదో దీర్ఘంగా ఆలోచించసాగేడు పోలీసాఫీసరు రాఘవరావు.

* * *

పూరిగుడిసెల్లో గుడ్డిదీపాలు వెలుగుతూన్నాయి.

గుడ్డిదీపాలుకాక మిగిలిందంతా చీకటి!

చీకట్లో ఆకలి ఆకలి. తీర్చుకోడానికి కొన్ని గుడిసెల్లో తప్పేలాలు పొయ్యి మీది కెక్కించేరు. మరికొన్ని గుడిసెల్లో ఆకలి వండుకుతింటున్నారు. ఒంటిమీద బట్టల్లేని పిల్లలు మురికిగా వున్నారు. పెంటకుప్పల మీద, కుళ్ళు కాలవల్లోనూ దొర్లుతూ ఆడుకుంటున్నారు. ఒక గుడిసెముందు తాగివొచ్చే మొగుడికోసం ఎదురుచూస్తోందొకామె. తాగడానికి గంజిలేక ఏడ్చిఏడ్చి పడుకున్న పసిపిల్ల లిద్దరివేపుచూస్తూ కూర్చుంది. ఆమె చూపులకేవేనా అర్థాలున్నాయా? -

ఆమె మెదళ్లో ఆలోచన లుంటాయా?

మరో గుడిసె గుమ్మంలో రేపుకూడా పస్తులుండకుండా వుండాలంటే ఏం చెయ్యాలా అని దీర్ఘంగా ఆలోచిస్తున్నాడొకడు.

మరో గుడిసెముందు స్కూలుకెళ్లే కొడుకు నిక్కరుని పన్నెండోసారి కుడుతోందొకామె. స్కూల్లో ఫ్రీగా చదవనిచ్చినా-లాగూ, చొక్కాలూ కుట్టివ్వరుగా!

అక్కడెన్నో ప్రశ్నలు, ఎన్నో సమస్యలు!...

ఎన్. జి. పాల్ రాకతో ఆ వాడంతా సందడితో నిండిపోయింది. చేతి కందినంత డబ్బుతీసి అడిగినవాళ్ళకి, అడగనివాళ్ళకి కూడా దానం చేసేస్తున్నాడు.



విభ్రమంతో పరికిస్తున్నారు జనం.

ఆశగా అర్రులు చాచి పరుగెడుతున్నారు. అందినంత అందుకుంటున్నారు. ఆనందంతో కేకలేస్తున్నారు. నాట్యం చేస్తూ పాటలు పాడుతున్నారు. అతనివేపు ప్రేమగా, అభిమానంతో చూస్తున్నారు. కొందరు దేవుణ్ణిచూసినట్టు భక్తిగా చూస్తున్నారు. మరికొందరు నమస్కారాలు చేస్తున్నారు.

పిచ్చివాడేమోనని అనుమానంగా చూస్తున్నారు.

ఇదంతా దూరంగా కూర్చుని చూస్తున్నారు ఇద్దరు యువకులు.

"రాచపుండుని పైపైన కోసేస్తే పోతుందా? దాన్ని సమూలంగా నాశనం చేసే మందు కావాలి. ఈ వేళ ఈయనొచ్చి రూపాయినోట్లు పంచేస్తే ... రేపట్నుంచి మామూలేగా?" అన్నాడు ఒకడు.

రెండోవాడు సమాధానం చెప్పలేదు. అతనివేపు చూస్తూ కూర్చున్నాడు.

"నువ్వెవరు బాబూ?" అనడిగేడు ఓ ముసలితాత.

"నేనెవర్నో నాకే తెలీదు తాతా! వారంరోజులక్రితం అతిపేదవాణ్ణి. కొన్ని క్షణాలక్రితం చాలా ధనవంతుణ్ణి. ఇప్పుడీ సూటుమాత్రమే నా ఆస్తి." అంటూనే కోటు విప్పి ఎవరికో ఇచ్చేసేడు. చొక్కా మరెవరికో దానం చేసేడు. షూస్ విసిరేసేడు.

"ఇప్పుడు 'నాది' అనే దింకేమీ లేదు తాతా! నేనొకప్పుడు జల్సాజీవితం గడపాలని ఎన్నో కలలు కనేవాణ్ణి. నూర్రూపాయల జీతానికి రెండువందల్రూపాయల అప్పుచేర్చి తెగతాగేవాణ్ణి. తిండికీ, బట్టకీ కూడా నా ముసలితండ్రిమీదనే ఆధారపడేవాణ్ణి. ఇరుగు, పొరుగు, బంధువులు, తల్లిదండ్రులు, తోడబుట్టినవాళ్ళు - అందరూ నన్నసహ్యించుకునేవారు. నేనెవర్నీ పట్టించుకునేవాణ్ణిగాదు.

ఓ రోజు తాగిన మైకంలో మా కంపెనీ మేనేజర్ని నడిరోడ్డుమీద నిలబెట్టి నానా మాటలూ అన్నాను. మర్నాడే నా ఉద్యోగం ఊడిపోయింది. ఇక నా తండ్రి దుఃఖాన్ని సహించలేక వెంటనే నన్ను ఇంట్లోంచి బైటికి నడవమన్నాడు. ఆ బాధతో - ఆ అవమానంతో జీవితాన్నించే నిష్క్రమించా లనిపించింది నాకు.

కాని, ఏదో కలిసొచ్చింది. నేనొకప్పుడు స్వర్గం అనుకున్నదంతా అనుభవించేను. అనుభవించినంతసేపూ నరకయాతన పడ్డాను. ఇప్పుడేంచేస్తానో, ఏమౌతానో నాకే తెలీదు," అని నిర్వేదంగా నవ్వేడు.

"అవుతే, ఇంత డబ్బెలా సంపాయించేరండీ?" అనడిగేడో యువకుడు.

"నువ్వు చాలా అమాయకుడిలాగున్నావు. డబ్బెలా సంపాయిస్తారో తెలీదా? దోపిడిచేస్తే వొస్తుంది. ఎవర్నేనా మోసంచేస్తే వొస్తుంది. నమ్మించి గొంతుకోస్తే వొస్తుంది. బేంక్లోంచి ఓ లక్ష రూపాయలు తీసుకెళ్తున్న సేఠ్ని చంపితే వొస్తుంది. కాని, చూడు మిస్టర్! కష్టపడితే రాదు. న్యాయం, ధర్మం పట్టుక్కూర్చుంటే రాదు. జ్ఞాపకం వుంచుకో!" అంటూ వెళ్ళిపోయేడు,

'అయితే నువ్వెలా సంపాయించేవు?' అనడగడానికి ధైర్యం చాల్లేదా యువకుడికి.

*   *   *

కాగితాలేవో పరిశీలిస్తున్న పోలీసాఫీసరు రాఘవరావు ఏదో నిర్ణయానికొచ్చిలేచేడు. ఎదురుగా వస్తూన్న వ్యక్తిని చూసి ఆశ్చర్యంగా ఆగిపోయేడు.

"థేంక్యూ, మిస్టర్ గోపాల్ వురఫ్ ఎన్. జి. పాల్! మాకు శ్రమని తగ్గించేవు. యూ ఆర్ అండర్ అరెస్ట్!" అంటూ ముందుకి నడిచేడు.

"వెరీ బేడ్లక్ సార్! యూ ఆర్ టూ లేట్ ... అంతా అయిపోయింది!" అన్నాడతను నవ్వుతూ!